సాక్షి నిజామాబాద్

సోమవారం ❘ 13 ❘ జనవరి ❘ 2025



ఏటీఎం ధ్వంసం

పిట్లంలోని ఏటీఎంలో ఆదివారం తెల్లవారు జామున చోరీ జరిగింది. ఏటీఎంను ధ్వంసం చేసి రూ.17 లక్షలు ఎత్తుకెళ్లారు.

- 8లో ▸



ఔషధాలు మెండుగ

సంక్రాంతి పండుగ సందర్భంగా వినియోగించే వస్తువులలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.5 /16.8

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సేవా కార్యక్రమాలు అభినందనీయం



నిజామాబాద్ అర్బన్: సివిల్ సబ్ ఇన్‌స్పెక్టర్లు 'కన్న ఊరు' పేరిట సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 2009 బ్యాచ్ ఎస్సైలు 'కన్న ఊరు' పేరిట సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఆదివారం రీడింగ్ మెటీరియల్, ఫర్నీచర్, రీడింగ్ ప్యాడ్స్, వాటర్ ఫ్రీజ్‌లను అందజేశారు. ఎస్సైలు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నమన్నారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ తారకం, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్, నరేష్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



మాక్లూర్: జూనియర్ విభాగం జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు 16 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు గంగామోహన్, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ వెల్లడించారు. మండలంలోని కల్లెడి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఎంపిక పోటీలు జరుగగా 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 18, 19, 20 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో జరిగే 46వ తెలంగాణ ఇంటర్ డిస్టిక్ జూనియర్ బాయ్స్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ, కోచ్ ఎండీ జావిద్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్, సుమన్, కిషోర్, సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారులు రాహుల్, సాయిలు పాల్గొన్నారు.

బోధన్‌లో రాష్ట్ర తొలి విశ్రాంత లోకాయుక్త పర్యటన



బోధన్: పట్టణంలోని ఆచన్‌పల్లి ప్రాంతానికి చెందిన ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర తొలి విశ్రాంత లోకాయుక్త వెంకట రాములు ఆదివారం స్థానిక చారిత్రక ఆలయాలను సందర్శించారు. హనుమాన్ మందిరం (ఆచన్‌పల్లి), శక్కర్‌నగర్ కోదండరామాలయం, ఏకచక్రేశ్వరాలయం, రేణుకా ఎల్లమ్మ మందిరాలను సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏక చక్రేశ్వరాలయంలో ఆలయ కమిటీ అధ్వర్యంలో వేదపండితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయ కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, డైరెక్టర్లు, తహసీల్దారు విఠల్ సన్మానించారు. బీటీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విశ్రాంత లోకా యుక్త చదువుకున్నారని ఆయన మిత్రులు తెలిపారు. న్యాయవాదులు నర్సింహారెడ్డి, ఇంద్రకరణ్, డాక్టర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లెకు సంక్రాంతి శోభ



సాలంపాడ్ క్యాంప్‌లో పిండి వంటలు చేస్తున్న మహిళలు

- సొంతూళ్లకు చేరిన వలస జీవులు
- నోరూరిస్తున్న పిండివంటలు
- సంబురాలకు సిద్ధమవుతున్న ప్రజలు
- నేడు భోగి.. రేపు మకర సంక్రాంతి

పల్లెలకు పండుగ శోభ వచ్చింది.. నోరూరించే పిండి వంటకాల తయారీతో ఇళ్లన్నీ సందడిగా మారాయి. ఆకట్టుకునే ముగ్గులతో లోగిళ్లు రంగులమయం అయ్యాయి. బతుకుదెరువు కోసం వలస వెళ్లిన ప్రజలు సొంతూరుకు చేరారు. మూడు రోజుల పాటు సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాల మధ్య చేసుకోవడానికి ప్రజలు సిద్ధమయ్యారు.

బోధన్/వర్ని: గ్రామాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. జిల్లావ్యాప్తంగా వేడుకలకు పల్లె జనం సన్నాహాలు చేసుకుంటున్నారు. ఉపాధి, ఉద్యోగాల కోసం వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కుటుంబ సభ్యులతో పండుగ చేసుకోవడానికి స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. నోరూరించే పండి వంటకాలు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దులు, గాలి పటాలు ఎగురవేయడం ఇలా ఎన్నో వినోదాత్మక సన్నివేశాలు పండుగ ప్రత్యేకతల్లో నిలిచాయి. మూడు రోజుల పాటు భోగి, సంక్రాంతి, కనుమ ఘనంగా జరుపుకుంటారు. భోగి రోజు చిన్నారులకు పండ్లు పోస్తారు. సాయంత్రం భోగి మంటలు వేస్తారు. రైతన్నల నేస్తాలు ఎద్దులు, ఆవులకు కనుమ పండుగ రోజు పూజలు చేస్తారు. పండుగ నేపథ్యంలో వారం రోజుల నుంచి పిండి వంటకాలు తయారు చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. తమ ముంగిళ్లలో రంగు రంగుల ముగ్గులు వేశారు.



శ్రీనగర్‌లో పిండి వంటలు చేస్తున్న మహిళలు



కుటుంబ సభ్యులతో అనసూయమ్మ





అల్లుళ్లొచ్చారు..

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలో ఆంధ్ర నుంచి వచ్చి స్థిర పడిన వారు అధికంగా ఉంటారు. వారు ఈ సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకుంటారు. కూతుళ్లు, అల్లుల్లు, మనవళ్లు, మనవరాళ్లను ఇంటికి పిలుచుకుని సంబరాలు జరుపుకుంటారు. వారికి కొత్త బట్టలు పెట్టి, పిండి వంటలు, విందు భోజనాలు పెట్టి సంతృప్తి చేస్తారు. గ్రామానికి చెందిన డి అనసూయమ్మకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు మనవళ్లు, ఇద్దరు మనవరాళ్లు ఉన్నారు. వారిలో ఒక మనవరాలు అమెరికాలో, ఇంకో మనవరాలు హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. మనవళ్లు ఇద్దరూ నిజామాబాద్ లో చదువుకుంటున్నారు. ఈ సంక్రాంతి పండుగకు పెద్ద కూతురు వైజాగ్ నుంచి, చిన్న కూతురు మట్టయ్య ఫారం నుంచి తమ కుటుంబంతో కలిసి వచ్చారు. మనవరాలు అమూల్య అమెరికా నుంచి అమ్మమ్మ ఇంటికి వచ్చింది. చాలా రోజుల తర్వాత అందరూ ఒక చోట కలుసుకోవడంతో శనివారం అందరితో కలిసి ఇంట్లో శాంతి హోమం చేయించింది. వారి కోసం పిండివంటలు సిద్ధం చేసింది. బోగి రోజు మనవళ్లు, మనవరాళ్లపై బోగి పళ్లు పోస్తామని, సంక్రాంతి రోజు తమ పెద్దలకు నైవేద్యం సమర్పిస్తామని అనసూయమ్మ తెలిపారు.

గాలిపటాలతో జాగ్రత్త

ఖలీల్‌వాడి: సంక్రాంతి వచ్చిందంటే చిన్నా పెద్ద తేడా లేకుండా గాలిపటాలు ఎగుర వేస్తూ ఎంజాయ్ చేస్తారు. అయితే చిన్నారులు పతంగులు ఎగుర వేసేటప్పుడు పెద్దలు ఓ కంట కనిపెట్టాలి. పిట్ట గోడలు లేని ఇళ్లపై గాలిపటాలు ఎగుర వేయొద్దు. విద్యుత్ వైర్లలో పతంగులు చిక్కుకుంటే వదిలేయాలి. వాటి కోసం వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అలాగే చైనా మాంజా వినియోగించొద్దు. మైదాన ప్రాంతాల్లో పతంగులు ఎగుర వేయాలి.



నగరంలో గాలిపటాలు కొనుగోలు చేస్తున్న చిన్నారులు



భోగి పిడకలతో చిన్నారులు

ఫ్లోరిడా నుంచి..



సంక్రాంతిని కుటుంబ సభ్యులతో జరుపుకునేందుకు ఫ్లోరిడా నుంచి వచ్చాను. నా రాకతో మా ఇంట్లో అప్పుడే పండుగ వాతావరణం నెలకొంది. రకరకాల పిండి వంటలను మా కుటుంబ సభ్యులు సిద్ధం చేసి ఉంచారు. పండుగకు స్వగ్రామానికి రావడం ఆనందంగా ఉంది.

– మేక సాత్విక, సత్యనారాయణపురం

అమెరికా నుంచి..



రెండేళ్లుగా అమెరికాలో ఎంఎస్ చదువుతున్నాను. ఈ సారి సంక్రాంతి పండుగ కోసం అమ్మమ్మ వాళ్లింటికి వచ్చాను. చాలా రోజుల తర్వాత అందరితో కలిసి పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉంది.

– అమూల్య, ధర్మారం

ఊరంతా పండుగ వాతావరణం



ఇప్పటికే ఊరంతా సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఏటా వేడుకలను అందరం కలిసి ఆత్మీయంగా జరుపుకుంటాం. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంత పండుగకు ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో గడుపుతారు.

– రాంచంద్రారెడ్డి, సాలంపాడ్ క్యాంప్

ఎన్నో ప్రత్యేకతలు



సంక్రాంతి ఎన్నో ప్రత్యేకతలు ఉన్న పెద్ద పండుగ. రెండు రోజుల నుంచి పిండి వంటకాలు తయారు చేస్తున్నాం. కుటుంబ సభ్యులమంతా ఒకే చోట చేరి వంటకాలు ప్రత్యేకంగా తయారు చేస్తాం. పండుగను సంప్రదాయ పద్ధతిలో జరుపుకుంటాం.– సుహాసిని, సాలంపాడ్ క్యాంప్

ఇష్టమైన పండుగ



సంక్రాంతి అందరికీ ఇష్టమైన పండుగ. మా ఊర్లో వేడుకలు ఆత్మీయంగా జరుపుకుంటాం. ముందుగానే ప్రత్యేకంగా పిండి వంటలు తయారు చేసుకుంటాం. మూడు రోజుల పాటు ఇళ్లల్లో పండుగ సందడి ఉంటుంది.

– సుశీల, సాలంపాడ్ క్యాంప్

పిండి వంటకాలు సిద్ధం



వారం నుంచి వంటకాలను తయారు చేస్తున్నాం. సకినాలు, కారా బూంది, పొంగలి, చెకోడీలు, బొబ్బట్లు వంటి పిండి వంటకాలను సిద్ధం చేశాం. – శ్రీలత, సత్యనారాయణపురం

రేవంత్‌రెడ్డిలో ఆర్‌ఎస్‌ఎస్ మూలాలు

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్ అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డిలో ఆర్‌ఎస్‌ఎస్ మూలాలు ఉన్నాయని అందుకే మైనారిటీల పట్ల వివక్ష చూపుతున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సారంగాపూర్‌లో తబ్లీఘీ జమాత్ ఏర్పాట్లు పరిశీలించి మీడియాతో మాట్లాడారు. గాంధీల కుటుంబాన్ని చూసి మైనారిటీలు కాంగ్రెస్‌కు ఓటువేశారని కాని ఇప్పుడు మైనారిటీల నమ్మకాన్ని కాంగ్రెస్ పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో ఒక్క మత కల్లోలం కూడా జరగలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక మతకల్లోలాలు జరిగాయన్నారు. మతకల్లోలాలను నిరోధించడానికి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గంగాజమునా తెహజీబ్ లా ఉన్న తెలంగాణలో చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. మైనారిటీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, మైనారిటీ డిక్లరేషన్ అమలు ఏమైందని అన్నారు. మైనారిటీలకు కేటాయించిన బడ్జెట్ లో కనీసం 25 శాతం కూడా ఖర్చు చేయలేదన్నారు. రూ.3000 కోట్లు కేటాయించి కేవలం రూ. 700 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని పేర్కొన్నారు. షాదీ ముబారక్ కింద రూ.1.6 లక్షలతో పాటు తులం బంగారం ఇస్తామని ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి అని విమర్శించారు. సారంగాపూర్‌లో త్వరలో జరిగే తబ్లిఘీ జమాత్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని కవిత అన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండ సౌకర్యాలు కల్పించాలన్నారు. మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా, బాజిరెడ్డి గోవర్దన్, జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

- స్వామి వివేకానందకు ఘన నివాళి



నిజామాబాద్ అర్బన్: వివేకానంద జయంతి సందర్భంగా నగరంలోని గాజుల్‌పేట్‌లో గల ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్ నివాళులు అర్పించారు. ఆయన సేవలను వారు కొనియాడారు.

మక్కకు కత్తెర కాటు

- పెరుగుతున్న పురుగు ఉధృతి
- పంట దిగుబడిపై రైతుల ఆందోళన
- జిల్లాలో 20,841 ఎకరాల్లో సాగైన మొక్కజొన్న



డొంకేశ్వర్‌లో కత్తెర పురుగు సోకిన మక్క

డొంకేశ్వర్(ఆర్మూర్): యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను చీడ పీడలు ఆశిస్తున్నాయి. కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా కనిపిస్తోంది. పురుగులు పంట ఆకులను, కాండాన్ని తినేస్తున్నాయి. దీంతో పంట ఎదుగుదలపై ప్రభావం కనిపిస్తోంది. కొంత కాలంగా తగ్గుముఖం పట్టిన కత్తెర పురుగు ఉధృతి మళ్లీ పెరగడం రైతాంగాన్ని కలవర పెడుతోంది. అధిక నష్టాన్ని కలిగించే ఈ పురుగు కారణంగా దిగుబడి ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 20,841 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. వేసిన దాంట్లో సగం పంట బుట్ట దశకు చేరుకుంది. ఇలాంటి సమయంలో కత్తెర పురుగు బారిన పడడం బుట్టకు ప్రమాదమని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. రైతులు పురుగును తొలి దశలోనే గుర్తించి తీసుకోవాల్సిన చర్యలు, ఉపయోగించే మందులను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ వివరించారు.

పురుగును ఇలా గుర్తించాలి

- మొదటి దశలో తల్లి రెక్కల పురుగు లేత మొక్కలపై పెట్టిన గుడ్లు పగిలి లద్దె పురుగులుగా మారి గుంపులుగా ఆకుల మీద పత్రహరితాన్ని గోకి తింటూ రంధ్రాలు చేస్తాయి. ఈ రంధ్రాలు ఆకులపై నిలువుగా కనిపిస్తాయి.
- రెండో దశలో లద్దె పురుగులు కాండం మొవ్వలో చేరి లోపల కాండాన్ని తినేస్తాయి. ఈ దశలో ఆశించిన కత్తెర పురుగు కాండాన్ని పూర్తిగా తినడంతో మొవ్వ కత్తిరించినట్లుగా ఉంటుంది. పురుగు తిని విసర్జించిన మల పదార్థంతో నిండి ఉంటుంది. మొవ్వ లోపల ఉన్న పూత కూడా నష్టపోయి కంకి తయారవదు.
- వాతావరణాన్ని బట్టి కత్తెర పురుగు జీవిత కాలం మూడు నెలల వరకు ఉంటుంది. తల్లి రెక్కల పురుగు జీవిత కాలంలో 900–1500 గుడ్లను పెడుతుంది. గుడ్ల సముదాయం దూది వంటి పదార్థంతో కప్పబడి ఉంటుంది. గుడ్లు, ఆకుపచ్చ, నలుపు, బూడిద రంగులో ఉంటే వాటిని కత్తెర పురుగు గుడ్లుగా గుర్తించాలి. లద్దె పురుగులు కోశాస్త దశలో భూమిలో చేరుతాయి.

నివారణ చర్యలు

- ఆలస్యంగా విత్తుకున్న మొక్కజొన్నలో అంతర పంటగా నేపియర్ గడ్డి వేసుకోవాలి. విత్తనం విత్తిన వారం రోజులకు ఎకరానికి 8–10 లింగాకర్షక బుట్టలు అమర్చి పురుగు ఉధృతిని గమనించాలి.
- వేపనూనె 5 మిల్లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే తొలిదశలో తల్లి పురుగు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు.
- విత్తనం విత్తిన 40–45 రోజుల దశలో స్పైనోసాడ్ ఎస్సీ 60 ఎంఎల్ 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎమమెక్టిన్ బెంజోయేట్ పిచికారీ చేయాలి.

క్లుప్తంగా

వివేకానందుడికి నివాళులు



నిజామాబాద్ అర్బన్: నగరంలోని శివాజీనగర్ లోగల వివేకానందుడి జయంతి సందర్భంగా వివేకానందుడి విగ్రహానికి ఎమ్మెల్సీ కవిత పూలమాలవేసి నివాళుర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు ఉన్నారు.

బడాపహాడ్‌లో పూజలు



వర్ని: మండలంలోని బడా పహాడ్ షాదుల్లా హుస్సేనీ దర్గాను ఆదివారం ఎమ్మెల్సీ కవిత దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దర్గాకు కాలినడకన వెళ్లి నైవేద్యాన్ని సమర్పించి ప్రార్థనలు చేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండి పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్లు కవిత వెల్లడించారు.

పండిత్ పరిషత్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నిక



ఘనపురం దేవేందర్

నిజామాబాద్ రూరల్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నిజామాబాద్ జిల్లాకు చెందిన జెడ్పీ హెచ్‌ఎస్ సారంగపూర్ తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి ఘనపురం దేవేందర్ ఎన్నికయ్యారు. హైదరాబాద్ హిందీ ప్రచార సభ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన సంఘం రాష్ట్రసర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఎండీ అబ్దుల్లా, కాంతి కృష్ణ, భిక్షపతి, ఎండి జమీల్, కేవీ రమణాచారి తదితరులు ఉన్నారు.

యువ రైతులు సంఘటితం కావాలి



నిజామాబాద్ నాగారం: యువ రైతులు సంఘటితం అయి కొత్త రకపు వ్యవసాయం చేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. జూబ్లీహిల్స్ రూట్స్ కాలేజీలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువ దినోత్సవం సందర్భంగా సేవ్ గ్లోబల్ ఫార్మర్స్ ఆధ్వర్యంలో యువ రైతు పురస్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు, జిల్లాకు చెందిన ఆర్మూర్ శ్రవణ్ పాల్గొని మాట్లాడారు. అనంతరం కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి వచ్చిన యువ రైతులకు పురస్కారాలు అందజేశారు. రూట్స్ కాలేజీ అధినేత భిక్షపతి, రవీందర్ ర్యాడ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ నాగారం: నగరంలోని జీజీహెచ్‌లో రోగి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోదావరి కోరారు. ఈ మేరకు ఆమె సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. మరోవైపు ఆస్పత్రిలో సూపరింటెండెంట్ జన్మదిన వేడుకలు జరుపుకున్న ఘటనపై కూడా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11న లక్ష్మి అనే రోగికి ఫిట్స్ వస్తోందని ఆస్పత్రికి తీసుకొస్తే పట్టించుకోలేదన్నారు.

గరిక..

- గరికలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి.
- పచ్చి గరికను మెత్తగా నూరి గాయంపై పూస్తే మానిపోతాయి.
- ప్రకృతి సమతుల్యతను కాపాడుతుంది.
- దగ్గు,ఆయసం,మలబద్ధకం నివారిస్తుంది.

బియ్యం..

- కడిగిన బియ్యం నీటిని పంచదారతో సేవిస్తే మూత్ర విసర్జన సాఫీగా ఉంటుంది.
- త్రిదోషహారిణిగా పనిచేస్తుంది
- శరీరానికి కార్బోహైడ్రేట్లు అధికంగా అందుతాయి.

గొబ్బెమ్మలు..



- ఆవుపేడతో తయారు చేయడంతో క్రిమిసంహారకంగా పనిచేస్తుంది.
- ప్రకృతి కాలుష్య నివారిణి
- ఉష్ణ ఉత్పత్తి ఉపయోగాలు అధికం

సంక్రాంతి పండుగ.. ఔషధాలు మెండుగ

- ముగ్గుల నుంచి పిండివంటకాల వరకు ఎన్నో ప్రత్యేకతలు

బోధన్‌రూరల్: ప్రత్యేకతలకు పెట్టింది పేరు హిందూ పండుగలు. ఒక్కో పండుగ ఒక్కో గొప్పతనాన్ని చాటుతుంటాయి. అందులో అతి ప్రత్యేకమైనది మన తెలుగు పండుగ సంక్రాంతి. ఈ పండుగ రోజున నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో ఎంతో విశేషం ఉంది. వేకువజామున ఇంటి ముందు వేసే రంగురంగుల ముగ్గుల నుంచి, ఇంట్లో చేసే పిండివంటకాల వరకు వేటికవి ఎంతో ప్రాముఖ్యం కలిగిఉన్నాయి. ఎన్నో ఔషధాలు, జీవకోటికి మేలు చేసే ప్రాముఖ్యతను పొందాయి. రానున్న సంక్రాంతి పండుగ నేపథ్యంలో మన పూర్వీకుల నుంచి వస్తున్న సంక్రాంతి సంప్రదాయాలు, ప్రత్యేకతలపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

పొంగలి..



- సంక్రాంతి నాడు చేసే పొంగాలికి బియ్యం, నువ్వులు, బెల్లం ఉపయోగిస్తారు. దీనితో పాటు పండగ రోజు పిండితో అరిసెలు చేస్తారు. వీటిలో కూడా పోషక విలువలు అధికంగా ఉంటాయి.

పూర్వకాలంలో మన పెద్దలు రాబోయే వైరస్‌లు, వ్యాధులను ముందుగా గ్రహించి వాటికి అనుగుణంగా ముందస్తుగా జాగ్రత్తలు పాటించేవారు. వాటిని పండుగలు, పర్వదినాల్లో మిళితం చేస్తూ ప్రకృతిలోని ఔషదాలు, పదార్థాలను వినియోగించే వారు. అలాగే సంక్రాంతి పండుగలో సైతం అనేక ప్రత్యేకమైన ఔషదాలు, సహజసిద్ధ పదార్థాలను వినియోగించేవారు. ప్రకృతిలో లభించే వరి, శనగలు, మునుములు, నువ్వులు, సజ్జలు, పెసర్లు, బొబ్బర్లు, ఉలవలు వంటి రకరకాల ఆహార పదార్థాల్లో అనేక ఔషద గుణాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. సంక్రాంతి ముందురోజు భోగి నాడు మూడెళ్ల లోపు పిల్లలకు గ్రహణ పీడలు, శని తొలగి సకల ఐశ్వర్యాలతో ఉండాలని కోరుతూ రేగి పండ్లు పోస్తారు. గొబ్బిళ్ల చుట్టూ ధాన్యాలు పోసి పశు పక్ష్యాదులకు ఆహారంగా అందిస్తారు. మరుసటి రోజు సంక్రాంతి నాడు కొత్త బియ్యం, బెల్లం, నువ్వులతో పులగం వండుకుంటారు. ఇలా సంక్రాంతి పండగ సమయంలో చేసే పనులన్నింటి వెనుక శాస్త్రీయ కోణం దాగి ఉంది.

నువ్వులు..



- శరీరంలో ఉష్ణ ఉత్పత్తిని పెంచుతాయి.
- ఔషద గుణం ఉంటుంది
- మూత్ర వ్యాధులను తొలగిస్తుంది
- ఎముకల్లో మజ్జ ఉత్పత్తిలో ప్రధాన ప్రాత వహిస్తుంది

బెల్లం..



- రక్తం వృద్ధి అయ్యేలా పని చేస్తుంది.
- శరీరంలో ఖనిజ లవణాలను పెంచుతుంది
- శరీరాన్ని కాంతిమాయంగా చేస్తుంది
- సర్వ దోష లక్షణాలను నివారిస్తుంది

పిండి కొమ్మలు (ఉత్తరేణి)..



- ఉత్తరేణి పుల్లలతో పళ్ల తోమ్ముకుంటే దంతాక్షయం తొలగిపోతుంది.
- జీర్ణ వ్యాధులు, త్రిదోశ, ఉదరవ్యాధుల నివారిణి
- పైత్యరసం ఉత్పత్తిలో ప్రాత వహిస్తుంది.

తంగేడు పూలు..

- శరీరానికి చలువ
- మధుమేహం, కఫం, అతిమూత్ర వ్యాధిని నివారిస్తుంది
- పువ్వులు కషాయంగా చేసుకొని సేవిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- కంటి చూపు బలపడుతుంది

పసుపు..



- క్రిమి సంహారిణిగా పని చేస్తుంది
- కామేర్ల వ్యాధి నివారణకు కృషి చేస్తుంది

రేగి పండ్లు....



- వాతం, మధుమేహం, మూల వ్యాధి నివారిణి
- రక్త శుద్ధి, ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది.
- శరీరానికి అవసరమైన వేడి పుట్టించడంతోపాటు చలువ కూడా చేస్తుంది
- విటమిన్ 'సీ' పుష్కలంగా లభిస్తుంది



గడ్కోల్ జెడ్పీహెచ్ఎస్ 1998-99 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు



రావుట్ల జెడ్పీహెచ్ఎస్ 2004-05 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

అపూర్వ ఆత్మీయ సమ్మేళనం



కొత్తపల్లి జెడ్పీహెచ్ఎస్ 1988-89 బ్యాచ్



కమ్మర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ 2002-03 బ్యాచ్

మాక్లూర్/కమ్మర్‌పల్లి/సిరికొండ: మాక్లూర్ మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988–89లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అలాగే కమ్మర్‌పల్లిలో జెడ్పీ హెచ్‌ఎస్ 2002–03 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సిరికొండ మండలంలోని గడ్కోల్, రావుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాడు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

క్రైం కార్నర్

ఏటీఎం ధ్వంసం.. నగదు చోరీ



పిట్లం(జుక్కల్): గుర్తు తెలియని దుండగులు ఏటీఎంను ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పిట్లం మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్బీఐ ఏటీఎంను గుర్తుతెలియని దుండగులు ఆదివారం తెల్లవారు జామున గ్యాస్‌కటర్ సహాయంతో ధ్వంసం చేశారు. అందులోని రూ. 17 లక్షల 79 వేల ఒక వంద నగదును చోరీ చేశారు. ఉదయం స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సీసీఫుటేజ్, వేలి ముద్రలు సేకరించారు. ఎస్బీఐ ఏటీఎం సూపర్‌వైజర్ రాచర్ల ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

లోన్ మాఫీ చేస్తామంటూ మోసం..నిందితుడి అరెస్టు

ఖలీల్‌వాడి: బ్యాంకులో ఉన్న రూ. 50 లక్షల రుణాన్ని మాఫీ చేయిస్తానని చెప్పి ఓ వైద్యుడి వద్ద డబ్బులు వసూలు చేసి, మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్‌లోని బీరప్పనగర్‌కు చెందిన బంగారు అప్పారావు (30) బ్యాంక్ రుణాలు మాఫీ చేయిస్తానని మోసాలకు పాల్పడుతుండేవాడు. తనకున్న పలుకుబడితో నగరంలోని డాక్టర్ని నమ్మించి బ్యాంకు లోన్ సెటిల్మెంట్ చేస్తానని తెలిపి అతని వద్ద నుంచి రూ. 15లక్షల తీసుకుని మోసం చేశాడు. దీంతో అతడు నగరంలోని ఒకటో టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితుడిని పట్టుకోగా కోరుట్లకు చెందిన డాక్టర్ వద్ద సుమారు రూ. 60లక్షలు, మోర్తాడ్‌కి చెందిన డాక్టర్ వద్ద రూ.12 లక్షలు డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు. వీరే కాకుండా ఇతరుల నుంచి చాలామంది దగ్గర లోన్ సెటిల్మెంట్ చేస్తానని ఎక్కువ మొత్తంలో డబ్బులు దండుకున్నట్లు వివరించారు. ఈ డబ్బులు అన్ని రియల్ ఎస్టేట్ లోనూ అప్పుల రూపంలోనూ ఇతరులకు ఇచ్చినట్లు తెలిపారు. ఈ డబ్బులతో కొన్ని ప్లాట్స్ కొన్నాడన్నారు. బంగారు అప్పారావు పట్టుకుని రిమాండ్ చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. ఈ కేసు విషయంలో ఇంకా విచారణ కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్.. ఒకరి మృతి

రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లి శివారులో ఆదివారం రాత్రి బైక్‌ను ఓ ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన యాదు(35) తన భార్య, ఇద్దరు చిన్నారులతో బైక్‌పై వస్తుండగా జల్లాపల్లి శివారులో వారిని ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్నవారు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు వారిని బోధన్ ఆస్పత్రికి తరలించగా, మార్గమధ్యలో యాదు మృతి చెందాడు. మృతుని భార్య అనిత, ఇద్దరు చిన్నారులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి కుటుంబం మహారాష్ట్రలోని సాంగ్లీ నుంచి ఎత్తొండకు వలస వచ్చి జీవనాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

ఒకరి ఆత్మహత్య

బోధన్ రూరల్(బోధన్): మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈనెల 9న ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. బండారుపల్లి గ్రామానికి చెందిన మల్లప్పగారి మాధవరావు(55) జాడిజ మాల్‌పూర్ గ్రామానికి చెందిన రెంజర్ల(చాకలి) లక్ష్మికి సన్నిహిత సంబంధం ఉంది. లక్ష్మి సుమారు 20రోజుల క్రితం తాను పని చేసే యజమాని ఇంట్లో రూ. 45వేలు దొంగలించి సొంతానికి వాడుకుంది. ఆ డబ్బులను చెల్లించాలని లక్ష్మి, ఆమె కొడుకు భూమయ్య, కోడలు రుక్మిణి మాధవరావును తరచు వేధించేవారు. తమకు డబ్బు ఇవ్వకపోతే దొంగిలించిన డబ్బు తనకే ఇచ్చినట్టు పోలీసులకు చెబుతానని మాధవరావును బెదిరించింది. ఈ క్రమంలో మాధవరావు భయపడి బిక్నెల్లి శివారులోని మంజీర నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిరికొండ: మండలంలోని కొండాపూర్ గ్రామ సమీపంలో రేషన్ బియ్యం తరలిస్తున్న మినీ వ్యాన్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రామ్ ఆదివారం తెలిపారు. గ్రామ సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి తన వాహనంలో ఎలాంటి అనుమతి లేకుండా రేషన్ బియ్యం తరలిస్తున్నాడని తెలిపారు. పోలీసులను చూసి ఆ వ్యక్తి తన వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయాడని తెలిపారు. వాహనంలో తనిఖీ చేయగా 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హుండీ చోరీ

బోధన్ రూరల్ (బోధన్): మండలంలోని రాజీవ్ నగర్‌తండా గ్రామంలోని జగదాంబ దేవి ఆలయంలో ఉన్న హుండీని గుర్తుతెలియని దుండగులు పగులగొట్టిన చోరీ చేసినట్లు రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. హుండీలో ఉన్న సుమారు రూ. 5వేల నగదును దుండులు దోచుకెళ్లారన్నారు. ఆలయ క్యాషియర్ నేనావత్ మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నగరంలో సంక్రాంతి సందడి



నగరంలోని పతంగుల దుకాణాల వద్ద యువకుల సందడి



కొనుగోలు చేసిన మాంజాతో చిన్నారి



సంక్రాంతి వచ్చిందంటే చిన్నపెద్ద తేడా లేకుండా పతంగులను ఎగురవేస్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం నగరంలోని ప్రధాన పోస్టాఫీస్ వద్ద గల పతంగుల దుకాణాల్లో సందడి నెలకొంది. చిన్నారులు, యువకులు పతంగులు, మాంజాలను కొనుగోళ్లు చేయడంతో సందడిగా మారింది. అలాగే విభిన్న రకాల పతంగులు ప్రజలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే పండుగ నేపథ్యంలో ఇళ్లల్లో పిండి వంటకాలు తయారు చేయడంలో మహిళలు బిజీగా ఉన్నారు. వంటకాల ఘుమఘుమలు నోరూరిస్తున్నాయి. అలాగే పలువురు మహిళలు నోములను కొనుగోలు చేస్తూ కనిపించారు. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ –నిజామాబాద్





వివిధ రకాల చెరకలు



ఆకట్టుకుంటున్న వివిధ రకాల పతంగులు



పతంగులు, మాంజాలను కొనుగోలు చేసుకొని వెళుతున్న యువకులు, చిన్నారులు



అందుబాటులో ఉన్న మాంజాలు



నోముల సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు



ఇంట్లో పిండివంటలు చేస్తున్న మహిళలు

కష్టకాలంలో బీఆర్‌ఎస్‌కు ద్రోహం చేశారు

- పోచారంపై విరుచుకుపడ్డ ఎమ్మెల్సీ కవిత
- పార్టీ మారి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని సవాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన మాజీ ఎమ్మెల్యే సురేందర్, జెడ్పీ మాజీ చైర్మన్లు

బాన్సువాడ : ''ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో స్పీకర్‌గా పని చేసిన వారు మళ్లీ ఎన్నికల్లో గెలవలే.. కానీ బాన్సువాడ ప్రజలు కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించి చరిత్ర తిరగరాశారు. అయితే బీఆర్‌ఎస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఆయన పార్టీని వదిలి ద్రోహం చేశారు'' అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ఆదివారం బాన్సువాడకు వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. బాన్సువాడ అభివృద్ధికోసం పార్టీ మారానని పోచారం చెబుతున్నారని.. ఆయన పార్టీ మారి ఆరునెలలు దాటిందని, ఎంత అభివృద్ధి చేశారో చెప్పాలని సవాల్ చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు బాన్సువాడ నియోజకవర్గానికి సంవత్సరానికి వెయ్యి కోట్ల రూపాయల చొప్పున నిధులు ఇచ్చారన్నారు. ఇప్పుడు పోచారం అన్ని నిధులు తీసుకురాగలరా అని సవాల్ చేశారు. గతంలో బాన్సువాడకు 30 వేల కేసీఆర్ కిట్లు ఇచ్చామని, కాంగ్రెస్ హయాంలో ఎన్ని కిట్లు ఇచ్చారో చెప్పాలని పేర్కొన్నారు. పోచారం వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రైతుబంధు పథకం ప్రవేశ పెట్టామని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా రూ. 15 వేలు ఇస్తామని చెప్పి దానిని రూ. 12 వేలకు తగ్గించి రైతులను మోసం చేస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తిమ్మాపూర్‌లోని తిరుమల వేంకటేశ్వర ఆలయానికి రూ.30 కోట్లు కేసీఆర్ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్ రూ. 4 వేలకు పెంచుతామని, మహిళలకు ప్రతినెలా రూ. 2,500 చొప్పున ఇస్తామని చెప్పారని, ఏడాది గడిచినా వాటిని అమలు చేయడం లేదని, దీనిపై పోచారం మహిళలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో దేశంలోనే బాన్సువాడ ఆస్పత్రి నంబర్ వన్‌గా నిలిచిందని పేర్కొన్నా రు. ఈ ఏడాది కాలంలో బాన్సువాడ ఆస్పత్రి ప్రాభవం ఎందుకు తగ్గిందో చెప్పాలన్నారు. కోతల కాంగ్రెస్ పార్టీలో పోచారం ఎందుకు చేరారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలకు, ప్రజలకు తాను అందుబాటులో ఉంటానన్నా రు. రాబోయే రోజుల్లో బాన్సువాడలో గులాబీ జెండా ఎగుర వేస్తామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జెడ్పీ మాజీ చైర్మన్లు దఫేదార్ రాజు, దాదన్నగారి విఠల్‌రావు, బోధన్ మాజీ ఎమ్మెల్యే సతీమణి అయేషా బేగం, మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, నాయకులు గణేష్, సాయిబాబా, మల్లేష్ గౌడ్, సాయిలు, మహేష్, రమేష్ యాదవ్, మౌలానా, గౌస్, సాయిలు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ల అరెస్టు



రికవరీ చేసిన బంగారు గొలుసులు



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఒక మైనర్‌తో పాటు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆర్మూర్ పోలీస్‌స్టేషన్లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని జెమ్మన్‌జిట్టి గల్లీకి చెందిన బట్టు బాల్‌రాజ్ ఓ మైనర్ అబ్బాయితో కలిసి నంబర్‌లేని స్కూటీపై తిరుగుతూ పలు చోట్ల చైన్ స్నాచింగ్ పాల్పడినట్లు తెలిపారు. మామిడిపల్లిలోని రకుంబాయి మెడలో నుంచి, పెర్కిట్ విశాఖ కాలనీలో, రాజారాం నగర్‌లో మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులను చోరీ చేశారన్నారు. సదరు నగలను పట్టణంలోని హరిచంద్రప్రసాద్‌కు విక్రయించారన్నారు. ఆదివారం ఉదయం పట్టణంలో నిందితులను అదుపులో తీసుకొని విచారించామన్నారు. బాల్‌రాజ్‌తోపాటు నగలను కొనుగోలు చేసిన హరిచంద్రప్రసాద్‌ను రిమాండ్‌కు తరలించారు. బాలున్ని జువైనల్ హోమ్‌కు తరలించారు. కాగ నిందితుల వద్ద నుంచి 75గ్రాముల బంగారాన్ని, స్కూటీను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏసీపీ ఐడీ పార్టీ సిబ్బందికి, కానిస్టేబుళ్లకు రివార్డులు అందించి అభినందించారు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, ఎస్సైలు గోవింద్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులు



చైనా మాంజాను స్వాధీనం చేసుకున్న అధికారులు

బోధన్: పట్టణంలోని పలు చోట్ల ఆదివారం టాస్క్‌ఫోర్స్ టీం ఏసీపీ నాగేంద్రచారి నేతృత్వంలో సీఐ అంజయ్య, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈమేరకు ఇన్‌చార్జి సీపీ ఒక ప్రకటనలో తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఆఫీసర్స్ క్లబ్‌పై దాడి చేసి పేకాడుతున్న 22 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 31వేల నగదు, 24 సెల్ ఫోన్‌లు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బోధన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అలాగే ఏఆర్ కిరాణా షాప్‌పై దాడి చేసి రూ. 8వేలు విలువ చేసే 8 చైనా మాంజా బాబిన్లను స్వాధీనం చేసుకున్నారు. షాప్ యాజమాని జునైద్ ఖాన్‌ను అదుపులోకి తీసుకుని పీఎస్‌లో అప్పగించారు.